క్లుప్తంగా

కోడూరులో శానిటేషన్ డ్రైవ్

కోడూరు: కోడూరు పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను శుక్రవారం నిర్వహించారు. పంచాయతీ కార్మికులు ప్రధాన రహదారులతో పాటు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల ఆవరణలను శుభ్రంచేసి బ్లీచింగ్ చల్లారు. పాఠశాలలు, దేవాలయాల పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. డ్రెయినేజీల్లో పేరుకుపోయిన సిల్ట్, చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించారు. అంతర్గత రహదారుల వెంట నిల్వ ఉన్న మురుగు నీటిని తొలగించి బ్లీచింగ్ చల్లారు. సర్పంచి వెన్నా షైనీ, ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది పర్యవేక్షించారు.

స్వామివారికి వెండి పళ్లెం సమర్పణ



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి మచిలీపట్నానికి చెందిన పొట్టా ఉమా లక్ష్మీనారాయణ దంపతులు శుక్రవారం 250 గ్రాముల వెండి పళ్లెంను సమర్పించారు. ఉదయం స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ అధికారులు బర్మా ప్రసాద్, కిషోర్‌లకు వెండి పళ్లెం అందించారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 8, 9 తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

అవనిగడ్డ: 8, 9 తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ అవనిగడ్డ ఏ1 మార్ట్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేశామని నిర్వాహకులు మానేపల్లి కోటయ్య తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 8, 9 తరగతుల విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు పరీక్ష జరుగుతుందని చెప్పారు. ప్రథమ బహుమతిగా రూ.5 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.2,500, తృతీయ బహుమతిగా రూ.1,250, నాలుగో బహుమతిగా రూ.500 నగదు అందిస్తామని చెప్పారు. ఇతర వివరాలకు మానేపల్లి కోటయ్య సెల్ 95507 94072 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఓబీసీ మోర్చా రాష్ట్ర సభ్యురాలిగా అంజనాదేవి

మచిలీపట్నంటౌన్: ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా మచిలీపట్నానికి చెందిన వీరమల్లు అంజనాదేవి ఎంపికయ్యారు. అంజనాదేవి ఎంపికకావడంపై స్థానిక బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, అయోధ్య రామయ్య, శ్రీనివాస్, సుబ్బారావు, హరికృష్ణ, మాదిరెడ్డి వెంకట సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

అవనిగడ్డ: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ సమావేశపు హాల్‌లో శనివారం జరుగుతుందని ఎంపీడీఓ ఎం. మరియదేవి తెలిపారు. సాయంత్రం మూడు గంటలకు ప్రారంభమయ్యే మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పాల్గొంటారని చెప్పారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు, సభ్యులు హాజరు కావాలని కోరారు.

మార్కెట్‌యార్డు చైర్మన్‌గా డేవిడ్ శామ్యూల్

మచిలీపట్నంటౌన్/కోనేరుసెంటర్: మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన అధ్యక్షునిగా గాడెల్లి డేవిడ్ శామ్యూల్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), వైస్ చైర్మన్‌గా కంచర్లపల్లి విజయశాంతి, సభ్యులుగా లేళ్ల లూర్దుకుమారి, సత్తినీడి కుమారి, మొహమ్మద్ మోసిన్, చండిక నాగజ్యోతి, పేరుబోయిన నాగరజని, తిరుమలశెట్టి వెంకటేశ్వరమ్మ, కర్రా వెంకట చంద్రిక, చోరగుడి రామచంద్రరావు, మద్దెల ఆదిలక్ష్మి, కొక్కిలిగడ్డ చంద్రలంక, తాడేపల్లి మెహర్‌బాబా, పి శివరామకృష్ణ, సమ్మెట శ్రీహరి, వేమూరి బదరీ నారాయణ, మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్ నిత్యానందం, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్‌లను నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సొసైటీ చైర్మన్ సురేంద్రనాథ్ బెనర్జీకి సన్మానం



వక్కలగడ్డ(చల్లపల్లి): నిజాయతీకి మారుపేరుగా నిలుస్తున్న వక్కలగడ్డ పీఏసీఎస్‌కు జాతీయ స్థాయి గుర్తింపు రావడం గ్రామానికి గర్వకారణమని సర్పంచ్ వల్లూరు ఉమా అన్నారు. శుక్రవారం స్థానిక పీఏసీఎస్ ఆవరణలో సొసైటీ చైర్మన్ హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీని రైతులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రైతు ప్రముఖులు పాల్గొన్నారు.

అందరికీ అన్నీ చేస్తున్నాం.. ఆశీర్వదించండి

- నిరుపేదల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి
- సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నకు అండగా ఉండండి
- మంత్రి జోగి రమేష్



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి జోగి రమేష్

పెడన: కుల, మత, రాజకీయాలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పెడన మండలం కాకర్లమూడి సచివాలయం పరిధి కాకర్లమూడిపాలెం, కాకర్లమూడి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాకర్లమూడి గ్రామ సచివాలయ పరిధిలో 338 మందికి ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ల రూపంలో రూ.9.50 లక్షలను అందజేస్తున్నామని చెప్పారు. 219 మందికి జగనన్న అమ్మఒడి రూ.32.55 లక్షలు, వైఎస్సార్ చేయూత ద్వారా 115 మంది లబ్ధిదారులకు రూ.21.56 లక్షలు, 44 డ్వాక్రా గ్రూపుల్లో 442 మంది సభ్యులకు వైఎస్సార్ ఆసరా కింద రూ.24.44 లక్షలు, రైతు భరోసా కింద 469 మంది రైతులకు రూ.57.97లక్షలు, 53 మందికి జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, 26 మందికి వాహన మిత్ర, 56 మందికి కాపు నేస్తం తదితర పథకాల కింద లబ్ధి చేకూరిందని మంత్రి వివరించారు. ఒకే ఇంటిలో నాలుగు కుటుంబాల వారు నివసిస్తున్నామని, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని స్థానికులు పేరం మల్లేశ్వరి, పేరం మాలాశ్రీలు మంత్రిని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కాకర్లమూడి గ్రామంలో ఇటీవల నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య పరీక్షలు చేయించుకోగా ఈసీజీ తీసి గుండె సంబంధిత సమస్య ఉన్నట్లు, ఉన్నత వైద్యం చేయించుకోవాలని వైద్యులు సూచించారని గుడిసె కుమారి అనే మహిళ మంత్రికి తెలుపగా, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో ఈమెను నమోదు చేయించి వైద్యం చేయించాలని మంత్రి వైద్య సిబ్బందిని ఆదేశించారు. గుడిసె సత్యనారాయణమ్మ మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపులో సభ్యురాలు అయిన నాకు పాడి గేదెలకు రుణం మంజూరు చేయించాలని కోరారు. కాకర్లమూడిపాలెం గ్రామంలో కొందరు రైతులు మంత్రిని కలిసి మోటార్లు పెట్టుకుని కూరగాయలు పండించుకుంటామని, విద్యుత్ సౌకర్యం కోసం కరెంటు స్తంభాలు వేయించాలని కోరగా అంచనాలు తయారుచేసి ప్రతిపాదనలు పంపాలని మంత్రి సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామంలో అక్కడక్కడా రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని మంత్రిని కోరారు. మంత్రి ప్రతి ఇంటి వద్ద ఆగి వారి యోగ క్షేమాలు తెలుసుకొని వారికి గత నాలుగేళ్లలో వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించి బుక్‌లెట్‌లను అందజేశారు. ప్రజలకు అన్నీ చేస్తున్న జగనన్నకు అండగా ఉండి మరోసారి ఆశీర్వదించాలని కోరారు. జనవరి నుంచి పింఛన్లు 3 వేలకు పెంపు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

విద్యార్థులతో ముచ్చట్లు..

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన మంత్రికి విద్యార్థులు స్వయంగా తయారు చేసిన పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అమ్మ ఒడి వస్తున్నదా? మధ్యాహ్న భోజనంలో ఈరోజు ఏమి వడ్డించారని మంత్రి ప్రశ్నించగా అన్నం, గుడ్డు, చిక్కి అంటూ విద్యార్థులు బదులిచ్చారు. నాడు–నేడు కింద పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయగా ప్రహరీ ఇంతవరకు నిర్మించలేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన మంత్రి చిన్నారులతో కొద్దిసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో పెడన మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ చారుమతి, వైస్ ఎంపీపీలు పరసా వాకాలమ్మ, యాదంరెడ్డి వరప్రసాద్, మాజీ ఎంపీపీ రాజులపాటి అచ్యుతరావు, పెనుమల్లి సర్పంచ్ రామానాయుడు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు దావు భైరవలింగం, మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు, మండల సచివాలయాల సమన్వయకర్త బెజవాడ నాగబాబు, ఎంపీడీఓ రెడ్డయ్య, నాయకులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

మేయర్ వెంకటేశ్వరమ్మ



బందరులో శిబిరాన్ని పరిశీలిస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ తదితరులు

మచిలీపట్నంటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. 22వ డివిజన్ ముస్తాఖాన్‌పేట రాంజీ హైస్కూల్‌లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించి మేయర్ మాట్లాడారు. రోగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, కార్పొరేటర్ ఏకశిరి వెంకటేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, వైఎస్సార్ సీపీ నాయకులు బూరగ రామారావు, షేక్ మొహమ్మద్ సాహెబ్, యువజన విభాగం నగర అధ్యక్షుడు షేక్ జలీల్, సచివాలయ కన్వీనర్ చైతన్య పాల్గొన్నారు.

కలెక్టరేట్ సుందరీకరణకు చర్యలు

కలెక్టర్ రాజాబాబు ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం కలెక్టరేట్‌ను సుందరీకరించి ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌కు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు సేదతీరేలా చెట్లను అధికంగా పెంచాలన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో అంతర్గత రహదారుల అభివృద్ధి, లైటింగ్, లెవలింగ్ పనులు, ప్రహరీ నిర్మాణం, జంగిల్ క్లియరెన్స్, డ్రెయిన్ల నిర్మాణం, పూలమొక్కల ప్లాంటేషన్ తదితర పనులను చేపట్టాలన్నారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి కలెక్టరేట్ ప్రధాన ద్వారం వరకు పిచ్చి మొక్కలు పెరిగాయని, అగ్నిమాపక సిబ్బంది సహకారంతో రోడ్లపైకి వచ్చిన చెట్ల కొమ్మలను తొలగించాలన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని వివిధ ప్రదేశాల్లో పల్లంగా ఉన్న భాగాలను గుర్తించి మెరక చేయాలని చెప్పారు. కలెక్టరేట్ ప్రహరీ మరో అడుగున్నర పెంచాలన్నారు. శిథిలమవుతున్న ఆర్డీఓ కార్యాలయం స్థానంలో నూతన భవనాన్ని నిర్మించాలని, మొదటి అంతస్తును ఏర్పాటు చేసుకుని టెలీ కాన్ఫరెన్స్‌హాల్‌ను ఏర్పాటు చేయాలని చెప్పారు. కలెక్టరేట్ ప్రధాన మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ద్విచక్ర వాహనాలు, కార్లు అస్తవ్యస్తంగా పార్కింగ్ చేస్తున్నారని, ట్రెజరీ కార్యాలయం వద్ద పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలం కేటాయించాలన్నారు. కార్యాలయాలు ఎక్కడ ఉన్నాయో తెలియజేసేలా సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. తూర్పు గోదావరి జిల్లా కడియపులంక నుంచి పూలమొక్కలు తెచ్చి సుందరంగా ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టరేట్‌లో విధిగా నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి లైటింగ్, రాత్రి వేళ గస్తీ ఉండేలా సెక్యూరిటీ ఏజెన్సీని ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, ఎంయూడీఏ వీసీ కె. రాజ్యలక్ష్మి, బందరు ఆర్డీఓ ఎం. వాణి, కలెక్టరేట్ ఏఓ ఏఎస్ఎన్ రాధిక, బందరు తహసీల్దార్ శ్రీవిద్య, పర్యాటక శాఖ జిల్లా మేనేజర్ రాంలక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 9లోగా అభ్యంతరాలు తెలపండి

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేశామని, అభ్యంతరాలు ఉంటే డిసెంబరు 9వ తేదీలోగా తెలియజేయాలని కలెక్టర్ రాజాబాబు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2024 జనవరి 5వ తేదీన ఓటర్ల తుది జాబితా ప్రచురిస్తామని చెప్పారు. ఈలోగా అర్హులై ఉండి ఎవరైనా ఓటర్ల జాబితాలో పేరురాకున్నా, తొలగించినా ఆన్‌లైన్ ద్వారా క్లయిమ్‌లు, అభ్యంతరాలు తెలియజేయవచ్చునన్నారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశామని, ఈ శిబిరాల్లో బీఎల్‌ఓలు పాల్గొంటారని, రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ లెవల్ ఏజెంట్లు కూడా హాజరుకావచ్చునన్నారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు షేక్ సలార్‌దాదా, వైఎస్సార్ సీపీ నాయకులు జక్కుల ఆనందబాబు, టీడీపీ నాయకులు బత్తిన దాసు, బీజేపీ నాయకులు పంతం గజేంద్ర, సీపీఎం నాయకులు కొడాలి శర్మ, బూర సుబ్రహ్మణ్యం, బీఎస్పీ నాయకులు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గౌరమ్మ పండుగ



గౌరమ్మ చుట్టూ పాటలు పాడుతూ తిరుగుతున్న మహిళలు

మచిలీపట్నంటౌన్: శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తెలంగాణలో బతుకమ్మ పండుగ మాదిరిగా మచిలీపట్నంలో గౌరమ్మ పండుగను ప్రజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 24వ డివిజన్ పాతరామన్నపేట యాదవుల బజారులోని వీరభద్రస్వామి ఆలయం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఖొజ్జిల్లిపేట నాగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రాగం ధర్మరాజు ఆధ్వర్యంలో ఈ ఆలయం వద్ద ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 11వ రోజున అమ్మవారికి 100 మంది మహిళలు పూజలు చేసి ఆమె చుట్టూ తిరుగుతూ పాటలు పాడి ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. పలువురు మహిళలు అమ్మవారికి ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అమ్మవారిని మంచినీటి కాలువ వరకు భారీ ఊరేగింపుతో తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. గత 80 ఏళ్లుగా ఈ ఆలయం వద్ద గౌరీ అమ్మవారి పండుగ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని ధర్మరాజు తెలిపారు. కార్యక్రమంలో భక్తులతో పాటు కార్పొరేటర్ చిత్తజల్లు ప్రసన్న, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ చిత్తజల్లు రాజు పాల్గొన్నారు.

ఓటర్ల ముసాయిదా జాబితాల ప్రదర్శన

పెడన: పెడన నియోజకవర్గంలో 1,62,832 మంది ఓటర్లు ఉన్నారని పెడన నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె. రాజ్యాలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెడన నియోజకవర్గానికి సంబంధించి ఓటర్ల ముసాయిదా జాబితాలను శుక్రవారం ప్రదర్శించామని చెప్పారు. నియోజకవర్గంలో పురుషులు 80,776 మంది, మహిళలు 82,051 మంది ఉన్నారని, ఇతరులు ఐదుగురు ఉన్నారన్నారు. పెడన పట్టణం, రూరల్‌లో మొత్తం 52,120 మంది ఉండగా పురుషులు 25,603 మంది, మహిళలు 26,515 మంది, ఇతరులు ఇద్దరు ఉన్నారని తెలిపారు. ఈ ఓటర్ల జాబితాలను పరిశీలించుకుని మార్పులు, చేర్పులు, కొత్తగా ఓటర్ల నమోదు చేయించుకోవాలనుకుంటే డిసెంబరు 9వ తేదీలోగా ఫారం 6, 7, 8లను పెట్టుకోవాలని ఆమె సూచించారు. నవంబరు 4, 5, డిసెంబరు 2, 3 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామని, ఈ నాలుగు రోజుల్లో ప్రతి ఎన్నికల బూత్‌లో ఫారాలను స్వీకరిస్తామని చెప్పారు. ముసాయిదా జాబితాలు కూడా పోలింగ్ కేంద్రాలలోను, రెవెన్యూ కార్యాలయాల్లోనూ ప్రదర్శిస్తున్నామని తెలిపారు.

రూ.40 లక్షలతో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ గరుడప్రసాద్

కృత్తివెన్ను: గ్రామాలలో అంతర్గత రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎంపీపీ గరుడప్రసాద్ తెలిపారు. రూ.40 లక్షలు అంచనాలతో ఐదు సీసీ రోడ్లకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని లక్ష్మీపురం గ్రామంలో నిర్వహించారు. దీనిలో భాగంగా మంత్రి జోగి రమేష్‌కు స్థానికులు అంతర్గత రహదారుల సమస్యను వివరించగా ఆయన ఆదేశాల మేరకు రోడ్ల నిర్మాణాలు చేపట్టామని ఎంపీపీ వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎ. సాయికుమార్, పులగం శ్రీనివాసరావు, పులగం రాము, పులగం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు భూమిపూజ

గూడూరు: గూడూరులోని మద్దాల ఎస్సీ కాలనీలో చేపట్టిన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచి లింగం సులోచనారాణి శుక్రవారం భూమి పూజ చేశారు. మద్దాల ఎస్సీ కాలనీ నుంచి మండల పరిషత్ కార్యాలయం వెనుకగా వెళ్లే రోడ్డు నిర్మాణ పనులకు పంచాయతీ నిధులు రూ.7.9 లక్షలు మంజూరయ్యాయని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు, రైల్వే బోర్డు సభ్యుడు మోటేపల్లి రత్నారావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆకూరి శ్రీనివాసరావు, లింగం విజయ్‌కుమార్, పావురాయిల ఆంజనేయులు పాల్గొన్నారు.

సమగ్రశిక్షా ఏపీసీగా రాములు నాయక్

చిలకలపూడి(మచిలీపట్నం): సమగ్ర శిక్షా అసిస్టెంట్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్‌గా రాములు నాయక్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీసీగా ఇప్పటి వరకు గిరిజన సంక్షేమాధికారి ఎం. ఫణిదూర్జటి ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించారు. ఈ స్థానంలో పశ్చిమ గోదావరి జిల్లా పౌరసరఫరాల శాఖలో విజిలెన్స్ విభాగంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న రాములు నాయక్‌ను ఈ స్థానంలో నియమించారు.

30లోగా అభ్యంతరాలు తెలపండి

నాగాయలంక: మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ క్రాప్ నమోదు పూర్తయిందని, సంబంధిత వివరాలను ఆర్‌బీకేల వద్ద ప్రదర్శించామని, అభ్యంతరాలు ఉంటే ఈనెల 30వ తేదీ లోగా తెలపాలని తహసీల్దార్ జె.వి మలకుమారి, ఏఓ ఎ.సంజీవరావు అన్నారు. రైతు పేరు, సర్వే నంబర్, విస్తీర్ణం, సాగు విధానం, పంట రకం తదితర అంశాల్లో ఎక్కడైనా తప్పులు ఉంటే ఈనెల 30వ తేదీలోగా సరిచేసుకునే అవకాశం ఉందని చెప్పారు. తుది జాబితా నవంబరు ఒకటిన ప్రదర్శిస్తామన్నారు. ప్రస్తుతం ఆర్‌బీకేలలో కొనసాగుతున్న సామాజిక తనిఖీ గ్రామసభల్లో రైతులు పాల్గొని అభ్యంతరాలు సరిచేసుకోవాలని తహసీల్దార్ చెప్పారు.

పీఏసీఎస్‌కు కంప్యూటర్ అందజేత

పురిటిగడ్డ(చల్లపల్లి): ఐవీఎం సురేష్ సేవలు ప్రశంసనీయమని పురిటిగడ్డ పీఏసీఎస్ చైర్మన్ యార్లగడ్డ హేమాంజనేయ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక పీఏసీఎస్‌కు ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ పురిటిగడ్డ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ రూ.40 వేల విలువైన నూతన కంప్యూటర్‌ను పీఏసీఎస్‌కు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ కంఠంనేని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు చల్లపల్లి మండల పరిషత్ సమావేశం

చల్లపల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ చేకు చినరాట్నాలు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కోట విజయ రాధిక అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

రేపు ఉచిత నేత్ర వైద్యశిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆస్పత్రి (పెదకాకాని) సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం ఏర్పాటు చేశామని సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మారుతీ కాన్వెంట్‌లో ఉదయం 9 నుంచి ఒంటిగంట వరకు శిబిరం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు సెల్: 94906 36466, 90747 77544 నంబర్లను సంప్రదించవచ్చునని చెప్పారు. శుక్లాలు ఉన్నవారికి శంకర కంటి ఆస్పత్రిలో ఆపరేషన్లు చేయిస్తామని చెప్పారు.

నేడు పెడన కౌన్సిల్ సమావేశం

పెడన: పెడన కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ మహేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అజెండాలోని 9 అంశాలపై చర్చ జరుగుతుందని, అధికారులు, సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

వక్కలగడ్డలో గ్రామసభ

చల్లపల్లి: ఉపాధి హామీ పనుల గ్రామసభ శుక్రవారం చల్లపల్లి మండలం వక్కలగడ్డ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. గ్రామంలో చేపట్టాల్సిన పనులను గుర్తించి వాటిపై చర్చించారు. గ్రామ సభ ఆమోదం పొంది ప్రణాళిక రూపొందించారు. సమావేశంలో సర్పంచ్ వల్లూరు ఉమా, పంచాయతీ ఈఓ పిట్టి సాంబశివరావు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

6 నుంచి ఉచిత శిక్షణ

మచిలీపట్నంటౌన్: నగరంలోని రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న పట్టాభి గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో నవంబర్ 6వ తేదీ నుంచి మగ్గం వర్క్స్, బ్యూటీ పార్లర్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తామని సంస్థ డైరెక్టర్ విజయభారతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందని చెప్పారు. శిక్షణ పొందేందుకు వచ్చిన మహిళలకు ఉచిత భోజనం, వసతి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్: 80089 96818 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

జెడ్పీ రోడ్డుకు మరమ్మతులు

మోపిదేవి: మోపిదేవిలో ఆదర్శ పాఠశాలకు వెళ్లే జెడ్పీ రోడ్డులో ఏర్పడిన గుంతలను స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు విస్సంశెట్టి ధనుంజయరావు సహకారంతో మరమ్మతులు చేశారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలు, వీటి వల్ల విద్యార్థులు, గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను సర్పంచ్ నందిగం మేరీరాణి ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన గుంతలు పూడ్పించారు. ధనుంజయరావుకు పంచాయతీ పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక నాయకులు నందిగం అభిషేకరావు, గోపీ పనులను పర్యవేక్షించారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

పులిగడ్డ(అవనిగడ్డ): మండల పరిధిలోని పులిగడ్డ గురుకుల పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఎస్‌టీపీ కుమార్ తెలిపారు. గుడివాడలో జరిగిన జిల్లా స్థాయి ఆటల పోటీల్లో ఖోఖోలో అండర్ 14, 17 విభాగాల్లో ఆర్. వరుణ్ కుమార్, కె. నవనీత్, వాలీబాల్ అండర్ 17 విభాగంలో ఎల్. సిద్ధు, కె. మోహన్ సంజయ్ విశేష ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ వివరించారు. ఎంపికైన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు జి. వీరకుమార్‌ని ప్రిన్సిపాల్ అభినందించారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక..

పెడన: ఖాదీ మహోత్సవ్ సందర్భంగా శుక్రవారం మండల స్థాయిలో జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో జరిగిన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశామని ఎంఈఓ హరనాథ్ తెలిపారు. వక్తృత్వ పోటీల్లో జూనియర్స్ విభాగంలో ఎం. హిమజ (కళాంజలి), కె.ఎస్.ఎల్.సుమ (విశ్వభారతి), పి. దిండుశిరివల్లి (బీజీకే జెడ్పీ) ఉన్నత పాఠశాలల నుంచి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. సీనియర్స్ విభాగంలో ఎన్. అమృతరాణి, ఎల్. గౌరిశ్రీ, వి. పావనిలు బల్లిపర్రు గురుకుల పాఠశాల నుంచి ఎంపికయ్యారు. వ్యాసరచన పోటీల్లో జూనియర్స్‌లో బి. శరణ్య (బీజీకే జెడ్పీ), జె. శ్రుతి (గురుకులం), పి. హారిక (బీజీకే జెడ్పీ) ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఎంపికయ్యారు. సీనియర్స్ విభాగంలో బల్లిపర్రు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు కె. శశి, జి. సరళ, సీహెచ్ శారద ఎంపికయ్యారు. వీరంతా 28వ తేదీ మచిలీపట్నం మున్సిపల్ పార్కు ఉన్నత పాఠశాలలో జరిగే జిల్లా స్థాయి పోటీలకు హాజరు కావాల్సి ఉంటుందని ఎంఈఓ హరనాథ్ తెలిపారు. ఉపాధ్యాయులు సత్యనారాయణ, శ్రీనివాసరావు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.